

పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిని ఎదుర్కోలేకే

అక్రమ అరెస్టులు



బాబుకు పెద్దిరెడ్డే టార్గెట్

- పెద్దిరెడ్డి కారణంగా చిత్తూరు జిల్లాలో బలహీనపడిన టీడీపీ
- ఇబ్బంది పెట్టడానికే ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు

పుంగనూరు : పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు కక్ష కట్టి కుట్ర రాజకీయాలు చేస్తున్నారు. 2014 నుంచే పెద్దిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని పలు కుట్రలకు దిగారు. ఎన్ని చేసినా ప్రజల్లో పెద్దిరెడ్డి కుటుంబానికి వస్తున్న ఆదరణను తగ్గించలేకపోయారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మానసిక క్షోభకు గురిచేసేలా ఆయన తనయుడు, రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మద్యం అక్రమ కేసు నమోదు చేయించారు. జూలై 19న అరెస్ట్ చేయగా సెప్టెంబర్ 29 వరకు 72 రోజులు జైలులో నిర్బంధించారు.

పెద్దిరెడ్డికి మానసిక వేధింపులు

కూటమి ప్రభుత్వం మాజీ మంత్రి పెద్దిరెడ్డిని మానసికంగా వేధించే మార్గం ఎంచుకుంది. ఆయన కుమారుడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని మద్యం అక్రమ కేసులో జూలై 19న చంద్రబాబు ప్రభుత్వం అరెస్ట్ చేసింది. మద్యం అక్రమ కేసులో అరెస్ట్ చేయడం ద్వారా రాజకీయంగా బలపడాలన్న టీడీపీ వ్యూహం ఎలా ఉన్నా ఉమ్మడి చిత్తూరు జిల్లా, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి కుటుంబాన్ని బలహీపర్చాలన్నది కలగానే మిగిలిపోనుంది. సాధారణంగా ఏదైనా కేసులో అరెస్టయిన వారిని అప్పుడే కస్టడీకి ఇవ్వాలని పోలీసులు న్యాయస్థానాన్ని కోరతారు. సిట్ అధికారులు మాత్రం మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసిన 62 రోజుల తర్వాత కస్టడీకి కోరడం ద్వారా బెయిల్‌ను అడ్డుకుని మరింతగా మానసికంగా ఇబ్బందులకు గురిచేయాలని చూశారు.

కుటుంబ సభ్యులు గెలవడం

పెద్దిరెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి చిన్న వయసులోనే రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ ఓటర్ల మనసును గెలుచుకున్నారు. వారికి దగ్గరై ఆత్మీయుడయ్యారు. 2014లో తొలిసారి ఎన్టీఆర్ కుమార్తెను పురందేశ్వరిని ఓడించి అధిక మెజార్టీతో ఎంపీగా గెలిచారు. తర్వాత 2019లో డీకే. సత్యప్రభ, 2014లో మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డిని ఓడించారు. 2024లోనూ విజయఢంగా మోగించారు. పెద్దిరెడ్డి తమ్ముడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని ఓడించాలని గత ఎన్నికల్లో చంద్రబాబు కుల రాజకీయాలను ప్రోత్సహించి తంబళ్లపల్లె రాజకీయాలను భ్రష్టు పట్టించినా ఓటర్లు విజ్ఞత చూపారు. పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని మరోసారి గెలిపించారు. దీంతో పెద్దిరెడ్డి కుటుంబం రాజకీయంగా విస్తరిస్తూ, బలం పెంచుకొంటూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలవడం, ఉమ్మడి చిత్తూరు జిల్లా, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం అంతటా ఉన్న ప్రజాదరణను చూసి చంద్రబాబు జీర్ణించుకోలేక పోతున్నారు. రాజకీయంగా దెబ్బతీసే పరిస్థితి, దారిలేక, ప్రజల్లో టీడీపీకి ఆదరణ, మద్దతు కూడగట్టలేని పరిస్థితుల్లో కుతంత్రాలకు తెరతీశారు.

పారని మదనపల్లె పన్నాగం

కూటమిపాలన రాగానే మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో 2024 జూలైలో జరిగిన అగ్నిప్రమాద కేసును అడ్డుపెట్టుకుని పెద్దిరెడ్డి కుటుంబాన్ని అభాసుపాలు చేసేందుకు ప్రయత్నించింది. స్థానిక అధికారులు దర్యాప్తు చేసి, పర్యవేక్షించే కేసు గురించి సీఎం హోదాలో చంద్రబాబు స్వయంగా ఆరోపణలు చేయడం, కేసును పర్యవేక్షించడం ద్వారా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇరుకున పెట్టాలని చూశారు. అంతేగాక పెద్దిరెడ్డి అనుచరులపై వేధింపులు, కేసులు నమోదు చేశారు. మదనపల్లెలో ఏది జరిగినా పెద్దిరెడ్డి కుటుంబానికి ఆపాదించి కుట్రలకు తెరలేపారు. కూటమి పాలకులు, చంద్రబాబు ఆరోపణల్లో ఒక్కటి నిజంలేదని తేలిపోయింది. దీంతో ఎన్ని ప్రయత్నాలు చేసిన పెద్దిరెడ్డి కుటుంబం కక్ష తీర్చుకోలేపోయిన కూటమి ప్రభుత్వం చివరకు మద్యం అక్రమ కేసులో మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసి వేధించింది.

1995 నుంచే పెద్దిరెడ్డిపై కుట్రలు

1995లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. తర్వాత అంచెలంచెలుగా ఎదిగి జిల్లా రాజకీయాలను శాసించే స్థాయికి చేరారు. అప్పటిదాక ఎదురులేదన్న ధీమాతో సాగిన టీడీపీ రాజకీయాలకు చెక్ పడింది. 1994లో టీడీపీ చిత్తూరు జిల్లాలో ఉన్న 15 నియోజకవర్గాల్లో 14 అసెంబ్లీ స్థానాలను గెలిచింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా వుండగా 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఆరుచోట్లే గెలిచింది. తొమ్మిది చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. ఆ తర్వాత జిల్లాలో కాంగ్రెస్‌ను టీడీపీకి ధీటుగా నిలబడేలా చేశారు పెద్దిరెడ్డి. ఎన్నికల్లో ఓటమి ఎరుగని నేతగా ఎదిగిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఆయన కుటుంబానికి జిల్లాలోనేకాక రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు, ప్రాధాన్యత దక్కాయి. సొంత జిల్లాలో తనను వ్యతిరేకిస్తూ టీడీపీని దెబ్బతీస్తున్న పెద్దిరెడ్డిని ఇబ్బందులను గురిచేసేందుకు చంద్రబాబునాయుడు ఎన్నో ప్రయత్నాలు చేశారు. పెద్దిరెడ్డి కుటుంబానికి చెందిన కాంట్రాక్టు సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. జిల్లాలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు టెండర్లు వేసి దక్కించుకున్నా వాటిని రద్దు చేయడం, పనులు నిలిపివేయించడం లాంటి వేధింపు చర్యలెన్నింటినో చేశారు. అయినా పెద్దిరెడ్డి రాజకీయంగా వెనకడుగు వేయలేదు. నమ్మిన ప్రజలకు అండగా ఉంటూ ఏరోజూ వారి సంక్షేమం మరవలేదు, విస్మరించలేదు. ఈ భరోసాతో జిల్లా ప్రజలు వారి కుటుంబానికి అండగా నిలిచారు.



టపాసుల విక్రయదారులు జాగ్రత్తలు తీసుకోవాలి

పుంగనూరు: దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల దుకాణదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిపక్షంలో షాపులను సీజ్ చేస్తామని అగ్నిమాపకశాఖాధికారి సుబ్బరాజు హెచ్చరించారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలన్నారు. అలాగే ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిమితికి మించి టపాకాయలను నిల్వ చేయడం, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడం లాంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లాటరీ టికెట్ల విక్రేత అరెస్ట్


పోలీసుల అదుపులోవున్న నిందితుడు అష్మద్

పలమనేరు: పట్టణంలో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న అష్మద్‌ను అరెస్ట్ చేసి రూ.22 వేల విలువైన 199 లాటరీ టికెట్లు, రూ.5,020లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మురళీమోహన్ తెలిపారు. ఇతనికి లాటరీ టికెట్లు అమ్మిన పట్టణానికే చెందిన చౌడప్పపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

ఆగని ఇసుక రవాణా

పలమనేరు నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. కూటమి నేతలు అధికారం అండతో యథేచ్ఛగా నదులు, చెరువుల్లో ఇసుకను తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం కోసం కొంతమేర ఇసుక తోలుకున్న పేదల నుంచి జరిమానా వసూలు చేసే రెవెన్యూ, పోలీసు అధికారులు కూటమి నేతల జోలికి వెళ్లకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

- నదులు, చెరువులను కొల్లగొడుతున్న పచ్చనేతలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు


కుర్నిపల్లి వద్ద నదిలో ఇసుకను తోడుతున్న జేసీబీ

గంగవరం: పలమనేరు నియోజకవర్గంలో పెద్దపంజాణి మండలంలో ప్రారంభమయ్యే కౌండిన్య నది గంగవరం, పలమనేరు మండలాల ద్వారా ప్రవహిస్తుంది. ఇందులో నాణ్యమైన ఇసుక వుంటుంది. దీనికి కర్ణాటకలో డిమాండ్ ఎక్కువగా వుంటోంది. ఈ క్రమంలో ఈ మూడు మండలాల్లోని ఇసుకాసురులు కౌండిన్య నదిని చెరబట్టారు. ముఖ్యంగా గంగవరం మండలంలోని కలగటూరు, కుర్నిపల్లి, గంగవరం, మేలుమాయి క్రాస్, మండల శివారు ప్రాంతాలైన పసుపత్తూరు, గుండుగల్లు, గంధ్రాజుపల్లి గ్రామాల సమీపంలో ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. అధికారం తమదే కావడం, తమ వాహనాలను ఎవరూ ఆపరన్న ధైర్యంతో రాత్రి, పగలూ తేడా లేకుండా జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా కర్ణాటకలోని ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. పగలు రహస్య ప్రాంతాల్లో ఇసుకను డంప్ చేయడం, రాత్రిళ్లు అడ్డదారుల్లో టిప్పర్ల ద్వారాకర్ణాటకకు తరలిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా ఇసుక అక్రమ రవాణా చేయరాదని ప్రభుత్వ ఆంక్షలు విధించినా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఇసుక అక్రమాల వైపు కన్నెత్తి కూడా చూసిన సందర్భాలు లేవు. పోలీసులు మాత్రం అడపాదడపా దాడులు చేసి వాహనాలను సీజ్ చేస్తున్నారు. అధికార బలంతో వాటిని మళ్లీ రిలీజ్ చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు.

ఎవరినీ ఉపేక్షించం

మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలపై నిషేధం వుంది. ఎక్కడైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుంటే దాడులు చేసి వాహనాలను సీజ్ చేస్తాం. పోలీసుల సహకారంతో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

– రేఖ, తహసీల్దార్, గంగవరం



నేడు విజయవాడలో విజ్ఞాపన సదస్సు

కుప్పం: విజయవాడలో శనివారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో విజ్ఞాపన సదస్సు నిర్వహిస్తున్నట్టు మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్స్ అసోసియేషన్ –1998 నియోజకవర్గ నాయకులు నాగరాజు, వెంకటముని, రమణయ్య విజయేంద్రరాజు, సుధాకర్ తెలిపారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంటీఎస్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరినా ఫలితం లేదన్నారు. ఈ క్రమంలోనే విజయవాడలో విజ్ఞాపన సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కుప్పం నియోజకవర్గం నుంచి ఎంటీఎస్ టీచర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన ప్రతి ఉపాధ్యాయుడికి రూ.20 వేలు పెన్షన్, వయో పరిమితి పెంచిన 12 నెలల కాలానికి జీతం ఇవ్వాలని కోరారు. అలాగే హెల్త్ కార్డులు జారీ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 98 ఎంటీఎస్ టీచర్స్‌ను సొంత మండలాలకు బదిలీ చేయాలన్నారు.



మాదకద్రవ్యాలను నియంత్రించాలి

గుడుపల్లె: మాదకద్రవ్యాలకు సంబంధించిన మెడిసన్‌ను నియంత్రించాలని తిరుపతి అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ హరిప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం గుడుపల్లెలోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో కుప్పం నియోజకవర్గంలోని మెడికల్ షాపుల అసోసియేషన్ యాజమానులకు మాదకద్రవ్యాలు, యాంటిబయోటిక్స్, వాటి నియంత్రణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ షాపుల్లో వైద్యులు నిర్ధారించిన మందులనే రోగులకు విక్రయించాలన్నారు. మత్తుకు సంబంధించిన మందులను వైద్యుల సలహా మేరకే రోగులకు ఇవ్వాలన్నారు. అనంతరం ఏడీ హరిప్రసాద్‌ను మెడికల్ షాపుల యజమానులు సన్మానించారు ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రుతు, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిరత్నం, ఈసీ సభ్యులు మోహన్‌బాబు, గోవర్ధన్, గౌతమ్ పాల్గొన్నారు.







నేడు మాజీ మంత్రి పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు

పుంగనూరు/సదుం: రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు బస్టాండులో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటామని తెలిపారు. అలాగే మిథున్‌రెడ్డి యువసేన అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేస్తామని వెల్లడించారు. శనివారం ఉదయం 10 గంటలకు పెద్దిరెడ్డి అభిమానులు, వైఎస్సార్ సీపీ అభిమానులు తప్పక హాజరై జయప్రదం చేయాలని కోరారు. అలాగే సదుంలో ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వి.కోట: పట్టణంలోని కార్స్ గ్రీన్ సిటీలో శనివారం కళావతి, దశరథరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆ ధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దశరథరెడ్డి తెలిపారు. చూపు మందగించిన వారికి పరీక్షలు చేసి అక్కడే అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు తీసుకురావడంతో పాటూ తలస్నానం చేసుకుని రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు కోసం 798151 9199, 9177869277లో సంప్రదించాలన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ తెలిపారు. ఇందులో పలువురు కంటి వైద్యులు పాల్గొని పరీక్షలు చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంకర తేలిన రోడ్డుతో అవస్థలు



గుడుపల్లె మండలంలోని గోవిందపల్లె నుంచి శెట్టిపల్లె వరకు వున్న రోడ్డు కంకర తేలి నడిచేందుకు కూడా వీలు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డు ద్వారా 10 గ్రామాలకు చెందిన గ్రామస్తులు రాకపోకలు సాగించాల్సి వుంది. కంకర తేలడంతోపాటు గుంతలు పడడంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - గుడుపల్లె

వర్షార్పణం



గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలో వున్న చెరువులన్నీ దాదాపు నిండిపోయాయి. కొన్నిచోట్ల పంటలు నీట మునిగాయి. మండలంలోని మేకలవారిపల్లె వద్ద వరి పంట నీట మునిగింది. తోటల్లో నీరు చేరడంతో కూరగాయల పంటలు కుళ్లిపోయాయి. - పులిచెర్ల(కల్లూరు)

కోటి సంతకాల సేకరణ పోస్టర్ల ఆవిష్కరణ

పలమనేరు/కుప్పం: పలమనేరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం, కుప్పంలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో నాయకులు శుక్రవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై కోటి సంతకాల సేకరణ పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు వైద్య అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకువచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడం వల్ల పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలమనేరు, గంగవరం పార్టీ కన్వీనర్లు బాలాజీనాయుడు, భాస్కర్ రెడ్డి, నాయకులు కమాల్, హైదర్, నరేష్, శ్రీనివాసులు, రాజారెడ్డి, నాగరాజు, శ్యామ్, షరీఫ్, అక్బర్ , కుప్పం వైఎస్సార్‌సీపీ మున్సిపల్ అధ్యక్షుడు హఫీజ్, ఉపాధ్యక్షుడు మునిరాజ్, మండల కన్వీనర్లు మురుగేష్, కోదండరెడ్డి, రామ్మూర్తి, మోహన్‌రామ్, దండపాణి, శ్రీనివాసులు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను బోధనకే పరిమితం చేయాలి

రొంపిచర్ల: టీచర్లను బోధనకే పరిమితం చేయాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం ఫ్యాప్టో నాయకులతో కలిసి ఎంఈవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బోధనేతర పనుల కారణంగా పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన అందించలేకపోతున్నామని వెల్లడించారు. ఈ క్రమంలో బోధనేతర పనులను పూర్తిగా బహిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో చెంగారెడ్డి, రవికుమార్, నరసింహారెడ్డి, నారాయణ నాయుడు, సదాశివరెడ్డి, యాసిన్, రమణయ్య, మదన్‌మోహన్ రెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిని ఘనంగా సన్మానం



వల్లివేడు రాజారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పులిచెర్ల(కల్లూరు) : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పులిచెర్ల మండలానికి చెందిన వల్లివేడు రాజారెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయనను శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. తనకు ఈ పదవి ఇప్పించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ నెల 13 నుంచి అసెస్‌మెంట్-2 పరీక్షలు ప్రారంభం

పలమనేరు: మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 13 నుంచి అసెస్‌మెంట్-2 పరీక్షలు ప్రారంభమవుతాయని ఎంఈవో లీలారాణి తెలిపారు. ఆమె శుక్రవారం ప్రశ్నపత్రాలను హెచ్‌ఎంలకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 13 నుంచి 15 వరకు, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 13 నుంచి 16 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఈవో-2 బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌ను నియంత్రించి ఆదర్శంగా నిలవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఎస్‌ఐ శ్రీనివాసులు

గుడుపల్లె: విద్యార్థులు ర్యాగింగ్‌ను నియంత్రించి ఆదర్శంగా నిలవాలని పీఈఎస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, గుడుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కళాశాలలో శుక్రవారం ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సీనియర్లు జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. వారికి విద్యలో సహకారం అందించాలన్నారు. పరస్పరం గౌరవించుకోవడం, వృత్తిపరమైన, నైతిక విలువలను పాటించాలన్నారు. విద్యార్థులు చదువుకునే వయస్సులో ర్యాగింగ్‌కు పాల్పటితే కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి మెలగాలని సూచించారు. కళాశాలలో ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పలమనేరు: పట్టణంలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీ జీవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పలమనేరు, పలమనేరు రూరల్, గంగవరం, వీకోట, బైరెడ్డిపల్లి మండలాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరా ఉండదని వెల్లడించారు.

సచివాలయం, గుడిలో చోరీ

పుంగనూరు: మండలంలోని సుగాలిమిట్ట గ్రామ సచివాలయంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. పంచాయతీ సెక్రటరీ రూపేష్‌నాయక్ శుక్రవారం ఉదయం చోరీ జరిగినట్లు గుర్తించారు. టీవీ, బ్యాటరీలను చోరీ చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మండలంలోని జౌకొత్తూరు గ్రామంలోని బోయకొండ గంగమ్మ ఆలయం తాళాలు పగులగొట్టి హుండీలోని సుమారు రూ.50 వేలు నగదు, 20 గ్రాముల బంగారు నగలు చోరీ చేశారు. తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల పల్లెనిద్ర

గుడుపల్లె: మండలంలోని అగరం సచివాలయంలో శుక్రవారం ఎస్‌ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. స్థానికులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో గొడవలకు పోరాదని యువకులకు సూచించారు. ఏదైనా సమస్య వస్తే పోలీసులను ఆశ్రయించాలన్నారు. మాదకద్రవ్యాలు, బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. వాహనాలు ఉన్న వారు డ్రైవింగ్ లైసెన్సు పొందాలని, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు.